సేవ, బాధ్యతకు ప్రతీక ఇండియన్ పోలీస్ సర్వీస్

- శిక్షణా ఐపిఎస్‌లతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సేవ, బాధ్యతకు అంకితమైన వృత్తి ఇండియన్ పోలీస్ సర్వీస్ అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. తెలంగాణకు కేటాయించబడి, రాష్ట్ర పోలీస్ అకాడమీ (టిఎస్‌పిఎ)లో శిక్షణ పొందుతున్న 77వ రెగ్యూలర్ రిక్రూట్ (ఆర్ఆర్) బ్యాచ్‌కు చెందిన ప్రొబెషనర్లు శనివారం హైదరాబాద్‌లోని రాజ్ భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాద పూర్వకంగా కలిశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను నిలబెట్టడం, ప్రజా భద్రతను కాపాడటం, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఇండియన్ పోలీస్ సర్వీస్ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. బాధ్యాతాయుతమైన వృత్తిని ఎంచుకున్న నేపథ్యంలో దానికి న్యాయం చేసేందుకు చివరి వరకు కృషి చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌పిఎ డైరెక్టర్ జనరల్ అభిలాషా బిస్త్, రాజ్ భవన్ అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్లకు రెండో రోజు నామినేషన్ల పర్వం కొనసాగింది. మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు సగటున ఒక్కటి కంటే తక్కువ, వార్డు మెంబర్ల స్థానాలకు సగటున 4.5 శాతం మాత్రమే నామినేషన్లు దాఖలయ్యాయి. ఉదయం పూట ముహూర్తం బాగా లేదని పలు ప్రాంతాల్లో సాయంత్రం మూడు గంటల నుంచి నామినేషన్ వేసేందుకు అభ్యర్థులు క్యూ కట్టారు. దాంతో 5 గంటల లోపు వచ్చిన వారికి రిటర్నింగ్ అధికారులు అధికారులు అవకాశం కల్పించారు. రెండో రోజు రాష్ట్ర వ్యాప్తంగా 4,236 సర్పంచ్ స్థానాలకు 4,901 నామినేషన్లు దాఖలు కాగా మొదటి రోజుతో కలిపి మొత్తం రెండు రోజుల్లో 8,198కి చేరాయి. అలాగే 37,440 వార్డులకు గానూ 9,643 నామినేషన్లు దాఖలు కాగా, మొదటి రోజుతో కలిసి 11,502కు చేరాయి. సర్పంచ్ స్థానాలకు రెండు రోజుల్లో అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 796 నామినేషన్లు వేశారు. 48 స్థానాలున్న ములుగు జిల్లాలో అత్యల్పంగా 63 నామినేషన్లు వచ్చాయి. 28,70 వార్డుమెంబర్లు ఉన్న నల్లగొండలో అత్యధికంగా 974, ములుగు జిల్లాలో 93 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండు రోజుల్లో సర్పంచ్ స్థానాలకు సగటున రెండు చొప్పున, వార్డు మెంబర్లకు మూడున్నర స్థానాలకు కేవలం ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైంది.

హత్యాకాండలను ప్రోత్సహిస్తున్న బిజెపి ప్రభుత్వం

- హిడ్మా ఎన్‌కౌంటర్‌పై సమగ్ర విచారణ జరపాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- మారేడుపల్లి బూటకపు ఎన్‌కౌంటర్లపై సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హత్యాకాండలను ప్రోత్సహిస్తోందని, హిడ్మా ఎన్‌కౌంటర్‌పై సమగ్ర విచారణ జరపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. అత్యంత దారుణంగా మావోయిస్టులను చంపడం బాధాకరమన్నారు. గ్రామస్తులు, ఆదివాసీలు చెప్పినదాని ప్రకారం.. కాళ్లు, చేతులు విరిగిపోయి శరీరంలోని భాగాల్లో గాయాలు ఉన్నాయని చెప్పారని, ఎన్ కౌంటర్ అయితే ఇన్ని గాయాలు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. చిత్రహింసలు పెట్టి చంపడం అన్యాయం అన్నారు. పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక ఆధ్వర్యంలో మారేడుపల్లి బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఎక్కువగా ఏకపక్షంగా నిరాయుధుల్ని చేసి చంపేస్తున్నారన్నారు. కేంద్ర మంత్రులు కూడా మావోయిస్టులను ఎరివేస్తామని ప్రకటిస్తున్నారని, నేరం చేస్తే చట్ట పరంగా శిక్షించాలే తప్ప చంపే హక్కు మీకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఖనిజ సంపదలను, భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, ఈ నేపథ్యంలోని ఎన్‌కౌంటర్లు జరిగాయని అర్థమవుతోందని అన్నారు.

ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. ఆదివాసీలకు స్వయం పాలన అధికారం దక్కాల్సిన అవసరం ఉందన్నారు. విస్తృతమైన ప్రజాస్వామ్య విలువల గురించి చర్చించాలన్నారు. ఎన్‌కౌంటర్ల పేరుతో ప్రభుత్వం హింసను ప్రేరేపించడం సరికాదన్నారు. న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జేవీ చలపతి రావు మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో అణచివేత, విధ్వంసానికి గురిచేస్తున్నారని అన్నారు. దేశ వ్యాప్తంగా హిడ్మా హత్య పట్ల చర్చ జరుగుతోందన్నారు. పోరాట వీరుల త్యాగాలు వృథా కావన్నారు. అరుణోదయ సమాఖ్య గౌరవ అధ్యక్షులు విమలక్క మాట్లాడుతూ.. ఎన్‌కౌంటర్ పేరుతో అమానుషంగా చంపేశారన్నారు. పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక నాయకులు విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, రమణాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బోణీ కొట్టిన సిపిఎం

- దుమ్ముగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా చిన్నక్క ఏకగ్రీవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్పంచ్ ఎన్నికల్లో సిపిఎం ముందే బోణీ కొట్టింది. భద్రాద్రి కొత్తగూడె జిల్లా దుమ్ముగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ బలపరిచిన సిపిఎం అభ్యర్థి పెద్ది చిన్నక్క మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆమె అభ్యర్థిత్వం లాంఛనం కానుంది.

IN THE HONOURABLE COURT OF THE CIVIL (SENIOR DIVISION) JUDGE TEKKALI
HMOP 106/2025

Between:-
Maddili Vinod ....Petitioner
And:-
Maddili @ Vanjarapu Sravanthi .....Respondent

To,
Maddili @Vanjarapu Sravanthi, W/o Vinod, Aged about 20 years, Hindu, Home maker, presently residing at Thumkunta village, Bank colony, Shamirpet Mandal, Medchal District, Telangana State. Mobile: 8885391393.

It is to inform you that the above matter stands posted on **18-12-2025** for your appearance. Hence you have to appear before the Honourable court of the civil (senior Division) judge at Tekkali on **18-12-2025** at **about 10.30 AM** as in person or through an Advocate without fail, otherwise the matter will be decided in your absence.

// By order of the Honourable court //

METTA GOVIND
ADVOCATE, TEKKALI
CELL: 9885941596.

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల వాతావరణం వేడుక్కుతోంది. రాజకీయాభిరుచి ఉన్నవాళ్లు పనులన్నీ పక్కనపెట్టి ఎన్నికలపైనే దృష్టి సారిస్తున్నారు. తొలి దఫా ఎన్నికల నామినేషన్ల ఘట్టం కూడా శనివారంతో ముగిసింది. రెండో విడత ఎన్నికల కోసం నామినేషన్ల ప్రక్రియ ఆదివారం నుంచి కొనసాగనుంది. మొదటి దఫాలో కొన్నిచోట్ల సింగిల్‌గానే అభ్యర్థుల ఎంపిక జరిగాయి. మరికొన్ని చోట్ల ఒకే పార్టీలో ఉన్నవారే సర్పంచ్, వార్డు మెంబర్ల కోసం రెండేసి నామినేషన్లు వేశారు. ఇలాంటి చోట్ల ఆయా పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులుగా ఎవరిని ఎంపిక చేయాలనే దానిపై విపరీతమైన కసరత్తు చేస్తున్నారు. తమ అభ్యర్థికి టికెట్ ఇవ్వాలని కోరుతూ ఆయా పార్టీలు, ఎమ్మెల్యేలు, మంత్రుల క్యాంప్ ఆఫీసులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ముఖ్యంగా అధికార పార్టీ నుంచి తీవ్ర పోటీ నెలకొంది. పైసలు ఉన్నవారికి పలుకుబడి లేకపోవడం.. పరపతి ఉన్న వారికి పైసలు లేకపోవటంతో అభ్యర్థుల ఎంపిక ఆయా పార్టీల జిల్లా నేతలకు తలనొప్పిగా మారింది. రిజర్వుడ్ స్థానాల్లో ఉపసర్పంచ్ పదవి కూడా ప్రతిష్టాత్మకంగా మారింది. రాష్ట్రంలో 12,760 పంచాయతీలు, 1,13, 534 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. 1.66 కోట్ల మంది గ్రామీణులు ఓటు హక్కు ద్వారా తమ గ్రామ పాలన వ్యవస్థను ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తిగా ఉన్నారు.

రసవత్తరం

- సర్పంచ్ అభ్యర్థుల ఎంపికలో నేతల తలమునకలు
- ఒక్కో ఊరులో గ్రూపులుగా పార్టీల క్యాడర్
- క్యాంప్ ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు

క్యాంప్ ఆఫీసుల చుట్టూ రాజకీయం

క్యాంప్ ఆఫీసుల చుట్టూ రాజకీయ నాయకుల ప్రదక్షిణలు కొనసాగుతున్నాయి. మంత్రుల క్యాంప్ ఆఫీసులు అత్యంత కోలాహలంగా మారాయి. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండటం.. ఎవరికి వారుగా తమ గ్రూపులతో చర్చలు జరుపుతున్నారు. గ్రామస్థాయి నేతలు కొందరు హైదరాబాద్ వరకూ వెళ్లి తమ వర్గం, లేదంటే కులానికి చెందిన వ్యక్తికి సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని ప్రాధేయపడుతున్నారు. మంత్రుల క్యాంప్ ఆఫీస్ ల ఇన్చార్జిలైతే క్షణం తీరిక లేకుండా ఆయా గ్రామాల నేతలతో సుదీర్ఘ చర్చలు సాగిస్తున్నారు. గ్రూపుల వారీగా వస్తున్న నేతలు తమ ప్రాబల్యాన్ని వివరిస్తూ మంత్రులు, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఇన్‌చార్జీలను ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకవేళ సయోధ్య కుదరకపోతే నేరుగా ఎమ్మెల్యేలు, మంత్రులను కలిసేందుకు హైదరాబాద్ వెళ్తున్నారు. తీవ్ర పోటీ ఉన్నచోట ఏకాభిప్రాయం కుదరని పక్షంలో నయానోభయానో ఒప్పించేందుకు నేతలు ప్రయత్నిస్తున్నారు. రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన కొన్నిచోట్ల పరపతి ఉన్నవాళ్లు ప్రతిపక్ష పార్టీలను వదిలి అధికార కాంగ్రెస్‌లో చేరుతుండటం గమనార్హం. కొన్ని చోట్ల అధికారి, ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులు ఏకమై సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులను పంచుకుంటున్నారు. వార్డుల ఎంపిక కూడా చేసేస్తున్నారు.

పెద్ద పంచాయతీల్లో సర్వేలు

మూడు, నాలుగు వేలకుపైగా ఓట్లు ఉన్న పెద్ద పంచాయతీల్లో అధికారపార్టీతోపాటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సర్వేలు సైతం చేయిస్తున్నాయి. ఏ అభ్యర్థికి విజయావకాశాలు ఉన్నాయో.. వారికి టికెట్లు ఇచ్చేలా సన్నాహాలు చేస్తున్నాయి. పెద్ద పంచాయతీల్లో వార్డు మెంబర్ అభ్యర్థుల ఎంపికను సైతం జిల్లా బాధ్యులే చూస్తుండగా.. చిన్న పంచాయతీల్లో ఆ గ్రామ నాయకులకే బాధ్యతలు ఇస్తున్నారు. నామినేషన్ల ఘట్టం ముగిసిన పది రోజుల్లోనే పోలింగ్ ఉండటంతో ఖర్చులు కూడా ఒకింత తగ్గుతాయనే ఆశాభావంతో కొందరు ఉన్నారు. ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు జరిగే గ్రామాల్లో మాత్రం ఓటుకు రూ.2, 3 వేలకు పైనే పంపిణీ చేయాల్సి ఉంటుందని లెక్కలు వేస్తున్నారు. 2,500 ఓట్లు ఉన్నచోట కనీసం 2000 ఓట్లకైనా డబ్బులు పంచాలని అంచనా వేస్తున్నారు. ఓటుకు వెయ్యి చొప్పున రూ.20 లక్షలు, ప్రచారానికి మరో పది లక్షల చొప్పున కేటాయించుకోవాలని సర్పంచ్ అభ్యర్థులుగా పోటీపడే వారికి నేతలు సూచిస్తున్నారు. ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా లేకపోవటంతో పలువురు ఆశావహులు ఆసక్తి ఉన్నా పోటీ నుంచి తప్పుకోవాలని భావిస్తున్నారు. గతంలో సర్పంచులుగా పోటీ చేసి ఎకరాల కొద్దీ భూములు కోల్పోయిన వారు అనేకమంది ఉన్నారు. అలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని కొందరు పోటీకి వెనకడుగు వేస్తున్నారు. మొత్తం మీద పంచాయతీ ఎన్నికలు గ్రామీణ వాతావరణాన్ని వాడీ వేడీగా మార్చాయనటంలో సందేహం లేదు.

మన వ్యవసాయాన్ని ప్రపంచస్థాయికి తీసుకుపోదాం

- అధికారులతో మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ వ్యవసాయ రంగాన్ని ప్రపంచస్థాయికి తీసుకుపోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లో "విజన్ డాక్యుమెంట్ 2047"పై ఆయన సమీక్షించారు. ఈ డాక్యుమెంట్‌లో కీలక భాగంగా రూపొందుతున్న "తెలంగాణ వ్యవసాయ - 2047 అగ్రిచాప్టర్"పై ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. భవిష్యత్తు వ్యవసాయ అభివృద్ధికి ఈ సమ్మెట్ పునాది వేయనుందని తెలిపారు. 2047 నాటికి తెలంగాణ వ్యవసాయం ఎలా ఉండాలి? దాని కోసం ఏ విధమైన వ్యూహాలు, విధానాలు, మౌలిక సదుపాయాలు అవసరం? ఏయే రంగాలు అత్యంత కీలకమనే అంశాలను శాస్త్రీయంగా పరిశీలించి ఈ నివేదిక రూపొందించనున్నట్టు తెలిపారు. తయారీలో రాష్ట్రానికి చెందిన వ్యవసాయ, హార్టికల్చర్, రీసెర్చ్, మార్కెటింగ్ సంస్థల ఉన్నతాధికారులు, నిపుణులు పాల్గొన్నారని చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్రమోహన్, వ్యవసాయ డైరెక్టర్ గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, వ్యవసాయ వర్సిటీ వైస్ ఛాన్సలర్ జానయ్య, ఉద్యానవర్సిటీ వైస్ ఛాన్సలర్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

Before The I Addl. Motor Accident Claims Tribunal : Nellore, A.P.
M.V.O.P.No. 77 / 2024

1. Shaik Ramija
and 2 others - Claimants
Versus
1. Kollur Sudharshan
and 3 others - Respondents

Notice

To,
R2. M.S.Arun Deepthi Ravada
(Policy holder) Flat No.543,
Ashok Raghavendra Apartments,
Hyderabad, Telangana State.

పై నెంబరున క్లయిమెంట్స్ మీపై నష్టపరిహారములు కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియు న్నారు. సదరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంట్ అయిన మీకు నోటీసు నిమిత్తం **తే22-12-2025ది** కి వాయిదా వేసియు న్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

పి.శ్రీనివాసులు, ఎం.ఎ., ఎం.ఎల్.,
క్లయిమెంట్స్ తరపు అడ్వకేట్, కావలి.

సర్పంచ్ ఎన్నికల బరిలోకి ఎస్ఐ

- ఐదు నెలల సర్వీసు ఉండగానే వీఆర్ఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట జిల్లా కోదాడ టౌన్‌లో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న పులి వెంకటేశ్వర్లు సర్పంచ్ ఎన్నికల పోరులోకి అడుగుపెట్టారు. మరో ఐదు నెలల సర్వీసు ఉండగానే స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (వీఆర్ఎస్) తీసుకోవడం స్థానికంగా హాట్ టాపిక్‌గా మారింది. గుడిబండ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు.. పుట్టిన ఊరిని అభివృద్ధి దిశగా నడిపించాలన్న సంకల్పంతో ఉద్యోగానికి రాజీనామా చేసినట్టు తెలుస్తోంది. రెండు దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉన్న వెంకటేశ్వర్లు ప్రజలకు మరింత దగ్గరగా ఉండేందుకు రాజకీయ రంగప్రవేశం చేయాలని నిర్ణయించుకున్నారు.

నా భర్తను కిడ్నాప్ చేశారంటూ మహిళ ఆరోపణలు

- ఆమెతోనే నామినేషన్ వేయించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన భర్త సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు వెళ్తుంటే అధికార పార్టీ నాయకుడు బెదిరించి కిడ్నాప్ చేశాడంటూ ఓ మహిళ మాజీ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో.. వెంటనే ఆమెతోనే నామినేషన్ వేయించారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెం గ్రామంలో జరిగింది. గ్రామపంచాయతీ ఎన్నికలలో బీఆర్ఎస్ తరపున పోటీ చేయొద్దు అంటూ సర్పంచ్ అభ్యర్థికి, వార్డు అభ్యర్థులకు కాంగ్రెస్‌కు చెందిన నాయకుడు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని ఆరోపణలు వినిపించాయి. దాంతో నామినేషన్ వేయడానికి ఇతర పార్టీల నుంచి ఎవరూ ముందుకు రాలేదని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి వెళ్తున్న క్రమంలో తన భర్త మామిడి యాదగిరిని కిడ్నాప్ చేశారంటూ ఆయన భార్య మామిడి లక్ష్మి మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి వద్ద వాపోయింది. దీంతో ఆయన వెంటనే లక్ష్మీతోనే నామినేషన్ వేయించి ఎల్లమ్మగూడెం గ్రామానికి వెళ్లారు. అయితే, కిడ్నాప్‌కు సంబంధించి ఎలాంటి ఫిర్యాదూ పోలీసులకు అందలేదని తెలిసింది.

కల్లుగీత వృత్తిని ఆధునీకరించాలి

- నీరాను ప్రభుత్వమే ప్రచారం చేయాలి
- మద్యం వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించాలి
- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ ప్రతినిధుల సభలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కల్లు గీత వృత్తిని ఆధునీకరించాలని, నీరాపై ప్రచారం కల్పించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అంతటి విజయ్‌ఫంక్షన్ హాల్- వర్ధిల్లి బుచ్చి రాములునగర్‌లో జరుగుతున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలో శనివారం ఆమె ప్రారంభోపన్యాసం చేశారు. వృత్తిని ఆధునీకరించి, నీరా తాటి, ఈత ఉత్పత్తులను ప్రోత్సహించి యువతి, యువకులకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. అభివృద్ధి పేరుతో తాటి, ఈత చెట్లను నరికివేయడం వల్ల గీత వృత్తి రోజురోజుకూ అంతరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశీయ వస్తువులను వాడండి అని చెబుతున్న ప్రధాని మోడీ.. ప్రకృతి పానీయం నీరా, కల్లును ఎందుకు ప్రోత్సహించడం లేదని ప్రశ్నించారు. సాఫ్ట్ డ్రింకులను ఉత్పత్తి చేసే బడా కార్పొరేట్ కంపెనీలు కోట్లాది రూపాయలు ప్రజల నుంచి దండుకుంటున్నాయని వివరించారు. వారికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభిస్తుంది కానీ వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న నిరుపేద కల్లుగీత కార్మికులకు ఎలాంటి ప్రయోజనమూ చేకూర్చడం లేదని అన్నారు. పోరాటాల పురిటి గడ్డ సూర్యాపేటలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాలుగో మహాసభ జరుపుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. తమ హక్కుల సాధన కోసం కల్లుగీత కార్మిక సంఘం నాయకత్వం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలి

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు

రాష్ట్రంలో కోటికి పైగా తాటి, ఈత, చెట్లు ఉన్నాయని, దీని ఆధారంగా రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు జీవిస్తున్నాయని వీరికి కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మహాసభలో ఆయన కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న కల్లుగీత వృత్తి రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలు రూపొందించాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం రూ.60-70 కోట్లు మాత్రమే కేటాయించి, అందులోనూ రూ.25-30 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్షణ కవచం పంపిణీ చేపట్టి సంవత్సరం దాటినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా 20,000 మందికి మాత్రమే ఇచ్చారని తెలిపారు. కల్లుగీత కార్మికులకు పెన్షన్ రూ.4 వేలకు, ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షల పెంచుతామని ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మిగిలిపోయాయన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని నందనములో గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమను నేటికీ ప్రారంభించలేదన్నారు. ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని 560 జీవో ఉన్నప్పటికీ అమలు కావడం లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన ఈ జీవోను సవరించి తెలంగాణ ప్రభుత్వం కొత్త జీవో ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు మహాసభ ప్రారంభ సూచికంగా కల్లుగీత కార్మిక సంఘం జెండాను సీనియర్ నాయకులు పామనగుండ్ల అచ్చాలు ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపానికి సీనియర్ నాయకులు అబ్బగాని బిక్షం పూలమాల వేసి నివాళి అర్పించారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి.రమణ, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బాలగాని జయరాములు, ఎస్ రమేష్ కుమార్, మడ్డి అంజిబాబు, బుర్ర స్వప్న అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సంతాప తీర్మానాన్ని కల్లుగీతకార్మిక సంఘం రాష్ట్ర నాయకులు చౌగాని సీతారాములు ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో కౌడిన్య అమెరికన్ ఆఫ్ నార్త్ ఇండియా అసోసియేషన్ చైర్మెన్ నాతి శ్రీనివాస్ గౌడ్, మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల్ల బాలకృష్ణ, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, జిఎంపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడత రవీందర్, బ్యాండు, వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు శాంత కుమార్ పాల్గొన్నారు.

TAAZA INTERNATIONAL LIMITED
Registered Office: 9-1-83 & 84 Amarchand Sharma Complex, Sarojini Devi Road, Secunderabad, Hyderabad, Hyderabad, Telangana, India, 500003,
email id: cstaaza01@gmail.com , Ph: +91 9154297389. CIN: L51100TG2001PLC072561

25వ వార్షిక సర్వసభ్య సమావేశం, రిమోట్ ఇ-ఓటింగ్ సమాచార ప్రకటన

1) ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా ఏజిఎం నోటీసులో పేర్కొన్నట్లుగా వ్యాపార నిర్వహణకు వీడియో కాన్ఫరెన్సింగ్ మరియు అదర్ ఆడియో విజువల్ మీన్స్ (వీసి) ద్వారా కంపెనీ యొక్క సభ్యుల 25వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజిఎం) సోమవారం, 22 డిసెంబర్, 2025న ఉ.11.00గం.లకు నిర్వహించబడును.
2) కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ("ఏజిఎం") తేది.19.09.2024 నాటి జనరల్ సర్క్యులర్‌నెం.09/2024 ద్వారా మరియు సెబి దీనితేది.అక్టోబర్ 3, 2024 నాటి సర్క్యులర్ SEBI/HO/CFD/CFD-PoD-2/P/CIR/2024/133 ద్వారా (ఇకపై సమిష్టిగా"సర్క్యులర్లు" అని సూచిస్తారు), "వీడియో కాన్ఫరెన్సింగ్ (వీసి) లేదా ఇతర ఆడియో విజువల్ మీన్స్ (ఓఏవిఎం) ద్వారా వార్షిక సర్వసభ్యసమావేశం (ఏజిఎం) నిర్వహించడంపై స్పష్టత''కు సంబంధించి, సభ్యుల భౌతిక హాజరు లేకుండా, వీసి/ ఓఏవిఎం ద్వారా వార్షిక సర్వసభ్య సమావేశం ("ఏజిఎం") నిర్వహించడానికి అనుమతించింది. పైన పేర్కొన్న సర్క్యులర్లకు అనుగుణంగా, కంపెనీ యొక్కఏజిఎం వీసి/ఓఏవిఎం ద్వారా నిర్వహించ బడుతోంది. ఏజిఎంకి సభ్యుల భౌతిక హాజరు అవసరం లేదు. వీసి/ఓఏవిఎం ద్వారా ఏజిఎంకి హాజరు కావాలనుకునే సభ్యులు ఏజిఎం నోటీసులో సూచించిన విధానాన్ని అనుసరించడం ద్వారా ఏజిఎంకి హాజరు కావచ్చు.
3) పైన పేర్కొన్న సర్క్యులర్ల ప్రకారం, ఏజిఎం నోటీసు యొక్క ఎలక్ట్రానిక్ కాపీలను కంపెనీ, రిజిస్ట్రార్ &షేర్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్/డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో ఇ-మెయిల్ ఐడిలునమోదుచేసుకున్న అందరూ వాటాదారులకు పంపబడింది మరియు 28.11.2025న ప్రక్రియ పూర్తయింది. అందువలన, ఏజిఎం నోటీసు యొక్క భౌతిక కాపీని పంపలేదు. ఈ పత్రాలు కంపెనీ వెబ్‌సైట్: taazainternational.comలో కూడా అందుబాటులో ఉన్నాయి మరియు స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్ అనగా బిఎస్ఇ లిమిటెడ్ www.bsein dia.com నుండి కూడా యాక్సెస్ చేయవచ్చు.
4) ఎన్ఎస్‌డిఎల్ ఇ-ఓటింగ్ సిస్టమ్‌ల ద్వారా వీసి/ఓఏవిఎం ద్వారా ఏజిఎంకి హాజరు అయ్యే సౌకర్యం వాటాదారులకు కల్పించబడుతుంది. వాటాదారులు www.evoting.nsdl.com వద్ద వాటాదారులు/సభ్యుల లాగిన్ ద్వారా రిమోట్ ఎవోటింగ్ ఆధారాలను ఉపయోగించి దీన్ని యాక్సెస్ చేయవచ్చు. వీసి/ఓఏవిఎం కోసం లింక్ వాటాదారుల సభ్యుల లాగిన్‌లో అందుబాటులో ఉంటుంది, అక్కడ కంపెనీ ఈవిఎస్ఎన్ ప్రదర్శించబడుతుంది.
5) కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్108 మరియు కంపెనీస్ (మేనేజ్‌మెంట్ అండ్అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014లోని రూల్ 20 ప్రకారం, కాలానుగుణంగా సవరించబడిన విధంగా, కంపెనీ వాటాదారులకు ఇ-ఓటింగ్ సౌకర్యాన్ని అందించడానికి కంపెనీ నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (రిమోట్ ఇ-ఓటింగ్) సేవలను ఉపయోగించుకుంది. కటాఫ్ తేది అనగా 15.12.2025 నుండి డీమెటీరియలైజ్డ్‌లో వాటాలను కలిగి ఉన్న సభ్యులు ఎన్ఎస్‌డిఎల్ యొక్క ఎలక్ట్రానిక్ ఓటింగ్ సిస్టమ్స్ (రిమోట్ ఇ-ఓటింగ్) ద్వారా ఏజిఎం నోటీసులో పేర్కొన్న విధంగా వ్యాపారంపై ఎలక్ట్రానిక్‌గా తమ ఓట్లను వేయవచ్చు.
6) సభ్యులకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా:
ఏ) ఏజిఎం నోటీసులో పేర్కొన్న వ్యాపారాన్ని ఏజిఎం వద్ద రిమోట్ ఇ-ఓటింగ్ సిస్టం ద్వారా లావాదేవీలు చేయవచ్చు.
బి) రిమోట్ ఇ-ఓటింగ్ 19.12.2025న(ఉ.09.00గం.లకు ఐఎస్టీకి) ప్రారంభమగును మరియు 21.12.2025న (సా.5.00 గం.లకు ఐఎస్టీకి) ముగియును. ఒక్కసారి తీర్మానంపై ఓట్లువేసిన తర్వాత, ఆ తర్వాత దానిని మార్చడానికి సభ్యులు అనుమతించబడరని సభ్యులు గమనించవచ్చు.
సి) ఏజిఎం వద్ద లేదా రిమోట్ ఇ-ఓటింగ్ సిస్టమ్స్ ద్వారా ఓటు అర్హతను నిర్ణయించుటకు కటాఫ్ తేది: 15.12.2025
డి) రిమోట్ ఇ-ఓటింగ్ మాడ్యూల్స్ 21.12.2025న సా.5.00గం.ల ఐఎస్టీ తరువాత డిసబుల్ చేయబడును.
ఇ) నోటీసు పంపిన తర్వాత మరియు కటాఫ్ తేదీనాటికి వాటాలను కలిగిఉన్న తర్వాత కంపెనీ వాటాలను కొనుగోలుచేసి కంపెనీ సభ్యుడిగా మారిన ఏ వ్యక్తి అయినా, కంపెనీ ఆర్‌టిఏ అనగా నిచ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అభ్యర్థన పంపడం ద్వారా లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను పొందవచ్చు. అయితే, అతను/ఆమె రిమోట్ ఇ-ఓటింగ్ కోసం ఎన్ఎస్‌డిఎల్‌లో ఇప్పటికే నమోదు చేసుకున్నట్లయితే, అతను/ఆమె ఓటు వేయడానికి తన ప్రస్తుత యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ఉపయోగించవచ్చు.
ఎఫ్) ఏజిఎం సమయంలో కూడా ఇ-ఓటింగ్ సౌకర్యం అందుబాటులో ఉంచబడుతుంది మరియు వీసి సౌకర్యం ద్వారా ఏజిఎంకి హాజరైన సభ్యులు మరియు రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా తీర్మానంపై ఓటు వేయని లేదా అలా చేయడానికి నిషేధించబడని సభ్యులు ఏజిఎంలో ఇ-ఓటింగ్ సిస్టం ద్వారా ఓటు వేయడానికి అర్హులు. ఏజిఎంకి ముందు రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా ఓటు వేసిన సభ్యులు కూడా ఏజిఎంకి హాజరు కావచ్చు కానీ మళ్ళీ ఓటు వేసే హక్కు ఉండదు.
జి) డీమెటీరియలైజ్డ్ మోడ్‌లో షేర్లను కలిగి ఉన్న సభ్యులకు మరియు వారి ఇ-మెయిల్ అడ్రస్‌లను నమోదు చేసుకోని సభ్యులకు రిమోట్‌గా ఓటు వేసే విధానం ఏజిఎం నోటీసులో అందించబడింది.
హెచ్)తమ ఇ-మెయిల్ అడ్రస్‌లను సంబంధిత డిపాజిటరీ పాల్గొనేవారితో నమోదు చేసుకోని సభ్యులు తమ ఇ-మెయిల్ అడ్రస్‌లను కంపెనీ రిజిస్ట్రార్‌తో నవీకరించని, ఏజిఎం నోటీసు కాపీలు, రిమోట్ ఇ-ఓటింగ్ కోసం సూచనలు మరియు వీసి ద్వారా ఏజిఎంలో పాల్గొనడానికి సూచనలను స్వీకరించడానికి ట్రాన్స్‌ఫర్ ఏజెంట్, నిచ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో అప్‌డేట్ చేసుకోవాలని అభ్యర్థించబడింది.
ఐ) ఏజిఎంలో ఇ-ఓటింగ్ ప్రక్రియ మరియు ఓటింగ్‌ను నిష్పాక్షికంగా మరియు పారదర్శకంగా పరిశీలించడానికి మెస్సర్స్ వివేక్ సురానా &అసోసియేట్స్, ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీస్‌ను స్క్రూటినైజర్‌గా కంపెనీ యొక్క బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు నియమించారు. స్క్రూటినైజర్ నివేదికతో పాటు ప్రకటించిన ఫలితాలను స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు తెలియజేయబడును మరియు ఏజిఎం ముగిసిన 48 గంటల్లోపు కంపెనీ వెబ్‌సైట్: taazainternational.com లో కూడా ప్రదర్శించబడును.
జె) ఇ-ఓటింగ్‌కు సంబంధించి మీకు ఏవైనా ప్రశ్నలు లేదా సమస్యలు ఉన్నచో, మీరు హెల్ప్ సెక్షన్ క్రింద www.evoting.nsdl.com లో అందుబాటులోని తరచుగా అడిగే ప్రశ్నలు (*FAQS*) మరియు ఇ-ఓటింగ్ మాన్యువల్‌ను చూడవచ్చు లేదా helpdesk. evoting@nsdl.com కు ఇమెయిల్ రాయవచ్చు లేదా 1800 1020990, 1800 22 44 30 నెంబర్లపై కాల్ చేయవచ్చు లేదా సంప్రదించండి: శ్రీమతి ప్రియా లడ్డా, కంపెనీ సెక్రటరీ, 9-1-83 &84, అమర్‌చంద్ శర్మ కాంప్లెక్స్, సరోజిని దేవి రోడ్, సికింద్రాబాద్, హైదరాబాద్, హైదరాబాద్, తెలంగాణ, ఇండియా-500003, ఇమెయిల్ ఐడి: cstaaza01@gmail. com, ఫోన్: +91 9154297389.

For Taaza International Limited
సం/-
ఝాన్సీ శనివరపు
హోల్ టైమ్ డైరెక్టర్
(DIN: 03271569)

ప్రదేశం: హైదరాబాద్
తేది: 28-11-2025

ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
A.S.No.41/2024

Between:
మానేపల్లి నాగలక్ష్మి ...అప్పిలెంట్
And
పొన్నపట్టి సరోజినీ & 5 అదర్స్ ...రెస్పాండెంట్స్
To.
4వ రెస్పాండెంటు :
4.మానేపల్లి వెంకటస్వామి, తండ్రి వీరయ్య, డోరునెం.8-119, వెంకటేశ్వరనగర్, రాఘవేంద్రస్వామి గుడి దగ్గర, మల్కాజిగిరి, హైదరాబాద్, తెలంగాణా రాష్ట్రము.

పై నెంబరు అప్పీలులో 4వ రెస్పాండెంటు హాజరు నిమిత్తం ది.08-12-2025 సం. తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పైకోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు పిటిషను ముందు గ్రంథము జరుపబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

శ్రీ మేడపాటి వెంకట రామారెడ్డి
పాలకొల్లు న్యాయవాది, పాలకొల్లు,
తేది.28-11-2025 పశ్చిమ గోదావరి జిల్లా.

విద్యుత్ శాఖపై భట్టికి కనీస అవగాహన లేదు

- విక్రమార్కకు మాజీ మంత్రి హరీశ్ రావు కౌంటర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ శాఖపై డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కకు కనీస అవగాహన లేదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. రెండేళ్ల నుంచి మంత్రిగా కొనసాగుతున్నా ఆయనకు శాఖపై ఎలాంటి పట్టు రాలేదని ఎద్దేవా చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్టేట్ పవర్ సెక్టార్ శ్వేతపత్రం, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025లను భట్టి విడుదల చేశారనీ, శనివారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో చెప్పిన గణాంకాలకు ఒకదానికొకటి పొంతన లేకుండా ఉన్నాయని తప్పు పట్టారు. తన శాఖకు సంబంధించిన విషయాలపై ఏ మాత్రం అవగాహన లేని డిప్యూటీ సిఎం.. ఇతరులను రాజకీయాలకు పనికి రారంటూ వ్యాఖ్యానిస్తారా? అని ప్రశ్నించారు. కమీషన్లపై ఉన్న శ్రద్ధ పాలసీలపై ఉంటే ఇలాంటి పొరపాట్లు జరగవని ఆయన ఎద్దేవా చేశారు. 'స్టేట్ పవర్ సెక్టార్ శ్వేతపత్రం పేజీ నెంబర్ 7లో 2023 డిసెంబర్ ఒకటి నాటికి సోలార్ కెపాసిటీ 6,123 మెగావాట్లు అని చెప్పారు. మొత్తం కాంట్రాక్టెడ్ కెపాసిటీ 19,475 అని చెప్పారు. 2025 జనవరి 11న విడుదల చేసిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ పేజీ నెం.8లో కరెంట్ ఇన్స్టాల్డ్ కెపాసిటీ 5,415 మెగావాట్లు అన్నారు. అప్ కమిగ్ 2,474 అనీ, మొత్తం 7,889 మెగావాట్లు అని తెలిపారు. 2023లో 6,123 మెగావాట్లు ఉంటే 2025 నాటికి 5,415 మెగావాట్లు ఎలా అయింది? పెరుగుతుందా? తగ్గుతుందా? శనివారం ఇచ్చిన పిపిటిలో చెప్పిన లెక్కలను గతంలో ప్రకటించిన పాలసీ, శ్వేతపత్రంతో పోల్చి చూసుకున్నారా?...' అని హరీశ్ రావు డిప్యూటీ సిఎంను ప్రశ్నించారు. 'క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ పేజీ నెంబర్ 8లో తెలంగాణ కరెంట్ కాంట్రాక్టెడ్ కెపాసిటీ 26,212 మెగావాట్లు అని పేర్కొన్నారు. అదే పాలసీ పేజీ నెంబర్ 10లో 2029-30 నాటికి 49,104 మెగావాట్లు అని తెలిపారు. 2034-35కు 66,694 మెగావాట్లు అని తేల్చారు. అంటే నిర్దేశించుకున్న లక్ష్యంలో 2029-30 నాటికి 1,729 (15,893-14,164) మెగావాట్ల థర్మల్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇటీవల ఇచ్చిన క్యాబినెట్ నోట్ ప్రకారం, 2,400 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నారు. క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని ఎందుకు తుంగలో తొక్కారు? ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం, 1,600 మెగావాట్ల ఎన్‌టిపిసి పవర్ అందుబాటులో ఉండగా, ఆ సంస్థలో ఒప్పందం చేసుకోకుండా ఎందుకు హడావుడిగా 2,400 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్స్ నిర్మాణానికి వెళ_న్నారు?' అని మాజీ మంత్రి ప్రశ్నించారు. ఇదంతా రూ.50 వేల కోట్ల బడా స్కాం అని ఆయన విమర్శించారు.

ఏకగ్రీవాల పర్వం

- కలకోట సర్పంచ్ అభ్యర్థిగా పైడిపల్లి అనిత ఏకగ్రీవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా శనివారం నామినేషన్ల ప్రక్రియ ముగియగా.. పలు చోట్ల సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం కలకోట గ్రామపంచాయతీ సర్పంచ్‌గా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్ సతీమణి పైడిపల్లి అనిత ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయింది. అదేవిధంగా 10 వార్డులు కూడా ఏకగ్రీవం అయ్యాయి.

నల్లగొండ జిల్లాలో..

నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం బసిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పెద్దల సమక్షంలో తుడుం శ్రావణి రాకేష్‌ను సర్పంచ్‌గా గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి గ్రామంలో కాంగ్రెస్‌కు చెందిన పందుల వెంకటయ్య సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పాత తండా వాసుల ఐక్యత : సర్పంచ్‌గా యువకుడి ఏకగ్రీవం

మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం పాతతండా గ్రామపంచాయతీ సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామస్తులంతా ఐక్యంగా 24 ఏళ్ల యువకుడు ఇస్లావత్ నరేష్ నాయక్‌కు పట్టం కట్టారు. గ్రామపంచాయతీ పరిధిలో సుమారుగా 536మంది జనాభా, 8 వార్డులు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన నరేష్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాష్ట్ర అవసరాలకే కొత్త విద్యుత్ ప్రాజెక్టులు

- గ్లోబల్ టెండర్ల ద్వారానే బిడ్ల ఖరారు
- సోలార్, హైడల్ విద్యుత్ ప్రాజెక్టులపై దృష్టి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచంతో పోటీ పడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రావసరాల కోసమే కొత్త విద్యుత్ ప్రాజెక్టులను ప్రతిపాదించామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి శనివారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో ఇంధనరంగ అవసరాలు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రామగుండం, పాల్వంచ, మక్తల్‌లలో మూడు కొత్త థర్మల్ పవర్ ప్లాంట్లను నిర్మించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పి కొట్టారు. గ్రిడ్ స్టెబిలిటీ, ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త ప్రాజెక్టులు చేపట్టామని చెప్పారు. 'గ్రిడ్‌ను స్థిరంగా ఉంచటానికి థర్మల్ పవర్ కూడా తప్పనిసరి. పునర్విනియోగం మాత్రమే సరిపోదు. బేస్‌లోడ్ లేకపోతే తెలంగాణ కూడా స్పెయిన్ పోర్చుగల్ అనుభవాలని చవి చూడాల్సి ఉంటుంది. గ్రిడ్ కుప్పకూలితే రాష్ట్రానికి రోజుకు రూ.15 వేల నుంచి రూ.20 వేల కోట్ల నష్టం వాటిల్లుతుంది. ఆస్పత్రులు, రక్షణ, రవాణా, టెలికాం, డేటా సెంటర్లు మొదలగు కీలకరంగాలన్నీ తీవ్రంగా దెబ్బతింటాయి. జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా గ్రిడ్‌లను రక్షించడానికి 5 వేల నుంచి 6వేల మెగావాట్ల థర్మల్ సామర్థ్యాన్ని పెంచాలి' అని భట్టి వివరించారు.

ఇంధన రంగ అవసరాలపై సమీక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పక్కన మంత్రులు

అభివృద్ధికి విద్యుతే ప్రధానం

ఏ రంగం అభివృద్ధి చెందాలన్నా విద్యుత్ అత్యంత ప్రధానమని, అందుకే రాష్ట్రానికి వచ్చే పదేండ్ల విద్యుత్ డిమాం డ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు వివరించారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సిఇసి) ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం 2014 నుంచి 2019 వరకు రాష్ట్ర విద్యుత్ గ్రోత్ 14.5 శాతం కాగా, తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 2024-25లో ఒక్క ఏడాదిలోనే 9.8 శాతంగా నమోదైందని అన్నారు. 2047 నాటికి 3 ట్రిలి యన్ డాలర్ల జిడిపి లక్ష్యాన్ని చేరా లంటే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఏటా 13 శాతం ఆర్థిక వృద్ధి, విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టుగా ఏటా 10శాతం వృద్ధి సాధిస్తేనే లక్ష్యాన్ని అధిగమిస్తామని భట్టి స్పష్టం చేశారు.

గ్రీన్ ఎనర్జీపై ప్రత్యేక దృష్టి

కేంద్ర మార్గదర్శకాలు, ఫ్రీ పొల్యూషన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీపై దృష్టి పెట్టిందని భట్టి అన్నారు. పారిస్ ఒప్పందం ప్రకారం 2030 నాటికి విద్యుత్ అవసరాల్లో 50 శాతం, 2070 నాటికి జీరో గ్రీన్ ఎనర్జీ వాడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వ ఆదేశాల ప్రకారం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఈ నిబంధన వర్తిస్తుందని అన్నారు. దానికి తోడు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను అధిగమించాలంటే గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందని భట్టి పేర్కొన్నారు.

ఎనర్జీ స్టోరేజీ పట్ల నిర్లక్ష్యం

గత సర్కార్ ఎనర్జీ స్టోరేజీని నిర్లక్ష్యం చేసిందని భట్టి విమర్శించారు. ఎనర్జీ స్టోరేజీకి రౌండ్-ది-క్లాక్ విధానం అవసరమని పేర్కొన్నారు. బ్యాటరీ విధానం ఖరీదైన నేపథ్యంలో సర్కార్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను ప్రతిపాదిం చిందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 ప్రాంతాలను పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ఉత్పతి ప్రాంతాలుగా గుర్తించా మన్నారు. అయితే వీటి నిర్మాణానికి 5 నుంచి 6 సంవత్సరాల సమయం పడుతుందని మంత్రి వివరిం చారు. తెలిపారు. సమావేశంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, సింగరేణి సిఎండి ఎన్.బలరామ్, ఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డి ముషారఫ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వాటర్ ట్యాంకర్ డ్రైవర్ మృతి

- మెట్రో స్టేషన్‌లో సంపు నింపుతుండగా ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రమాద స్థలంలోనే మృతిచెందిన డ్రైవర్

కారు ఢీకొనడంతో వాటర్ ట్యాంకర్ డ్రైవర్ మృతిచెందారు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండి సంతోష్ కుమార్(44) తన భార్య మంజుల, కుమారునితో కలిసి కొంతకాలంగా ఉప్పల్‌లోని తిరుమల మెడోస్ కాలనీలో నివాసమంటున్నాడు. స్టాన్లీ ఇంజినీరింగ్ కళాశాలలో సంతోష్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దాంతోపాటు రాత్రి సమయాల్లో వాటర్ ట్యాంకర్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా, శుక్రవారం రాత్రి 8:30 నిమిషాలకు వాటర్ ట్యాంకర్ డ్రైవింగ్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. శనివారం ఉదయం అతను కూకట్‌పల్లి నుంచి మియాపూర్ మార్గంలో ట్యాంకర్‌ను పక్కకు ఆపి కెపిహెచ్‌బి మెట్రో స్టేషన్‌లో సంపును నింపుతుండగా వెనుక నుంచి హోండా వెర్నా కారు అతన్ని ఢీకొట్టింది. దాంతో సంతోష్ అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం వాటర్ ట్యాంకర్ యజమాని వెంకట్ ద్వారా సమాచారం తెలుసుకున్న సంతోష్ భార్య కెపిహెచ్‌బి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సాయి కిరణ్ అనే వ్యక్తి కారును అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపి తన భర్త మరణానికి కారణమయ్యాడని ఆవేదన వ్యక్తం చేసింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాగర్ కర్నూల్ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్

- నలుగురు విద్యార్థులపై సస్పెన్షన్
- క్రమశిక్షణా చర్యలు తీసుకున్నాం : ప్రిన్సిపాల్ రమాదేవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ కలకలం రేపింది. జూనియర్ విద్యార్థులను ర్యాలింగ్ చేసిన నలుగురు సీనియర్ విద్యార్థులపై కళాశాల క్రమశిక్షణ కమిటీ చర్యలు తీసుకుంది. ఈనెల 6న మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులను రెండో సంవత్సరం విద్యార్థులు గోడ కుర్చీ వేయించి ర్యాగింగ్ చేశారు. ఈ ఘటన చూసిన విద్యార్థులు ఆందోళన చేయడంతో క్రమశిక్షణ కమిటీ చర్యలకు ఉపక్రమించింది. సీనియర్ విద్యార్థులపై రెండు నెలలు కళాశాల, ఏడాదిపాటు హాస్టల్ నుంచి సస్పెండ్ చేసింది. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మెడికల్ కళాశాల సిబ్బంది హెచ్చరించింది.

చర్యలు తీసుకున్నాం...: ప్రిన్సిపాల్ రమాదేవి

ఈ నెల 6న నలుగురు విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడినట్టు మా దృష్టికి రాగానే చర్యలకు ఉపక్రమించాం. వారిని ఏడాది పాటు హాస్టల్‌కు దూరంగా ఉంచడమేగాక రెండు నెలలపాటు కళాశాల నుంచి సస్పెండ్ చేశాం. విద్యార్థులు చదువును పక్కకు పెట్టి ఇటువంటి చర్యలకు పాల్పడం సరికాదు. మునుముందు ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

గవర్నర్‌తో షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ బృందం భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ ప్రతినిధి బృందం భేటీ అయింది. శనివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా షియా సామాజిక వర్గానికి సముచిత ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఆర్టికల్ 171(5) ప్రకారం (గవర్నర్ కోటా) ఎమ్మెల్సీ నామినేషన్ కోసం వినతిపత్రం సమర్పించారు. జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హిదాయత్ అలీ మిర్జా, మొహమ్మద్ అలీ హైదర్, చైర్మెన్ షబ్బీర్ అలీ మిర్జా, ఉపాధ్యక్షులు సయ్యద్ ఆబిద్ హుస్సేన్, సిఇఒ సయ్యద్ షకీల్ హైదర్, జాతీయ కన్వీనర్ సయ్యద్ హైదర్ రజా నక్వీ, మొహమ్మద్ సాధిక్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల పెండింగ్ బిల్లులు రూ. 707.30 కోట్లు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు సంబంధించిన రూ. 707.30 కోట్లు విడుదల చేస్తూ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆర్థిక శాఖ అధికారులు నవంబర్ నెలకు సంబంధించి రూ.707.30 కోట్ల పెండింగ్ బిల్లులను శనివారం విడుదల చేశారు. ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీలో భాగంగా ప్రతినెల రూ.700 కోట్లకుపైగా నిధులను ప్రభుత్వం విడుదల చేస్తోంది. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నవంబర్‌తో వరుసగా నాలుగు నెలలుగా ఉద్యోగుల బకాయిలను చెల్లిస్తూ వచ్చింది. ఇందులో గ్రాట్యుటీ, జిపిఎఫ్, సరెండర్ లీవ్స్, అడ్వాన్స్ లకు సంబంధించిన బిల్లులు ఉన్నాయి.

హిల్ట్‌లో లోపాలు ఉండటం వల్లే చర్చకు రాలేదా?

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై ఏలేటి ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (హిల్ట్) పాలసీలో లోపాలు ఉండటం వల్లే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చర్చకు రాలేదని బిజెపి ఎల్పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మంత్రి రాక కోసం ఆయన ఎదురు చూశారు. చర్చకు ఆయన రాకపోవడంతో ఏలేటి విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6.30 లక్షల కోట్ల అవినీతికి పాల్పడుతున్నట్టు ఆధారాలతోసహా రుజువు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. హిల్ట్ విధానంలో పారదర్శకత ఉంటే, మంత్రి ఉత్తమ్ ఎందుకని చర్చకు రాలేదని ప్రశ్నించారు. ప్రతిపక్షాలకు అర్థం కాలేదనడం ఉత్తమ్ దివాళాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ విధానంలో పారదర్శకత ఉంటే, దానిపై చర్చించేందుకు అసెంబ్లీ మీడియా పాయింట్‌కు రమ్మంటూ చేసిన సవాల్‌ను మంత్రి ఉత్తమ్ ఎందుకు స్వీకరించలేదని ప్రశ్నించారు. తను రుజువు చేసినట్లయితే, కాంగ్రెస్ ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి, మంత్రులు రాజకీయ సన్యాసం తీసుకునేందుకు సిద్ధమా? అని సవాల్ విసిరారు.

సాగర్ టు శ్రీశైలం లాంచీ ప్రయాణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగార్జునసాగర్ నుంచి కృష్ణానదిలో శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణాన్ని శనివారం తెలంగాణ టూరిజం వాటర్ ఫ్లూయిట్ జనరల్ మేనేజర్ మాన్వి ప్రారంభించారు. వారం రోజుల కింద సాగర్ నుంచి శ్రీశైలానికి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ లాంచి ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్టు ప్రకటించినా కొన్ని కారణాల చేత వాయిదా పడింది. శనివారం 30 మంది ప్రయాణికులతో సాగర్ నుంచి బయల్దేరిన టూరిజం లాంచి సాయంత్రానికి శ్రీశైలం చేరుకుంది. శ్రీశైలం వెళ్లిన ప్రయాణికులు తిరిగి ఆదివారం సాయంత్రం నాగార్జునసాగర్‌కు చేరుకుంటారు. మొదటిసారిగా శ్రీశైలం వెళ్తున్న లాంచిలో జిఎం మాన్వి, సాగర్ లాంచి యూనిట్ మేనేజర్ హరి, టూరిజం అధికారులు రాజేష్ తదితరులు కూడా వెళ్లారు.

సిఎంతో శుభలేఖ సుధాకర్ భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సినీ నటుడు శుభలేఖ సుధాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. డిసెంబర్ 15న రవీంద్రభారతి ఆవరణలో ప్రముఖ సినీ గాయకుడు, దివంగత ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రావాలంటూ ఆయన సీఎంను ఆహ్వానించారు. విగ్రహ ఏర్పాటుకు అనుమతించినందుకు ఎస్‌పి బాలసుబ్రమణ్యం కుటుంబం తరపున ముఖ్యమంత్రికి సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసుల వేధింపుల వల్లే రాజేష్ మృతి

- సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరపాలి
- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోదాడ, చిలుకూరు పోలీసుల వేధింపుల వల్లే దళిత యువకుడు కర్ల రాజేష్ మృతిచెందారని, ఈ కేసుపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని కెవిపి ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కోదాడ గాంధీ నగర్‌లోని కర్ల రాజేష్ తల్లి, తమ్ముడిని శనివారం కెవిపిఎస్ నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. రాజేష్ మృతికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. సిఎం రిలీఫ్ ఫండ్‌లో అక్రమాలు జరిగాయనే పేరుతో రాజేష్‌పై కేసు నమోదు చేయకుండా నాలుగు రోజులు విచారణ పేరుతో చిలుకూరు, కోదాడ పోలీసులు వేధింపులకు గురి చేశారని తెలిపారు. రిమాండ్ చేయకముందే అనారోగ్యంతో బాధపడుతున్న రాజేష్‌కు సకాలంలో మెరుగైన చికిత్స అందించకపోవడంతో మృతిచెందారని అన్నారు. కేసు నమోదై.. పోలీసుల విచారణను ఎదుర్కొన్న రాజేష్‌ను జైల్లో నుంచి ఆస్పత్రికి తరలించాక మృతిచెందితే.. కనీసం ప్రభుత్వ అధికారులు ఆ కుటుంబాన్ని పరామర్శించకపోవడం దుర్మార్గమన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని, కుటుంబానికి ప్రభుత్వం నుంచి కోదాడ రూరల్‌లో ఐదెకరాల భూమి ఇవ్వాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

రాజేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న స్కైలాబ్‌బాబు, తదితరులు

రాజేష్ తల్లి లలితకు ప్రభుత్వ ఉద్యోగం, కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. పోలీసులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టంతో పాటు హత్యానేరం కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో ఆయన వెంట కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి, ఉపాధ్యక్షులు పిండిగ నాగమణి, నాయకులు జంగపల్లి శ్రీను,సాయి కుమార్, బాను, గణేష్, పాటల గోపి ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలన్నింటికీ త్వరలో పరిష్కారం

- టిడబ్ల్యుజెఎఫ్ నాయకులతో మంత్రి పొంగులేటి
- జర్నలిస్టు సంఘాలతో త్వరలో సమావేశం నిర్వహిస్తామని మంత్రి హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర కమిటీ రాష్ట్ర సమాచార, పౌరసం బంధాలు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలోని తన చాంబర్‌లో టిడబ్ల్యుజెఎఫ్ అడ్‌హక్ కమిటీ కన్వీనర్ పి రాంచందర్, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు బి.రాజశేఖర్, పి రాధిక, గుడిగ రఘు,కార్యదర్శి ఈ చంద్రశేఖర్, హెచ్‌యూజే అధ్యక్షులు బి అరుణ్‌కుమార్, నాయకులు అచ్చిన ప్రశాంత్ తదితరులు మంత్రిని కలిశారు. దాదాపు గంటపాటు జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. వెంటనే అక్రిడిటేషన్లు ఇవ్వాలనీ, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో కొత్త ఆరోగ్య కార్డులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇండ్లస్థలాల విషయంలో కొత్త విధానం తీసుకురావాలని మంత్రిని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇండ్లస్థలాల సమస్యలతో జర్నలిస్టు సంఘాలు, సీనియర్ జర్నలిస్టుతో సమావేశం నిర్వహించి పరిష్కరించాలని అన్నారు. చనిపోయిన జర్నలిస్టులకు రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సూచించారు. మహిళా జర్నలిస్టులకు రాత్రి పూట పనిచేసే చోట నుంచి ఇంటివరకు రవాణా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాల మాదిరిగా రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ వసతిని ప్రవేశపెట్టాలని కోరారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీలు ఏర్పాటు చేయాలనీ, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి అటాక్స్ కమిటీని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన మంత్రి త్వరలో జర్నలిస్టుల సంఘాలతో సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. అంతకుముందు సమాచార శాఖ డైరెక్టర్ కిషోర్‌బాబు, అదనపు డైరెక్టర్ డిఎస్ జగన్‌కు సైతం వినతిపత్రాలు అందజేశారు.

మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న టిడబ్ల్యుజెఫ్ నాయకులు

సైబర్ నేరస్థులకు సహకరిస్తున్న ఇద్దరి అరెస్ట్

- ముంబయిలో పట్టుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ట్రేడింగ్ పేరుతో మోసం చేస్తున్న సైబర్ నేరస్థులకు సహకరిస్తూ తప్పించుకుని తిరుగు తున్న ఇద్దరు నిందితులను హైదరా బాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మహా రాష్ట్రలోని నవీ ముంబయిలో అరెస్టు చేశారు. కొద్ది నెలల కిందట ట్రేడింగ్ పేరుతో సైబర్ నేరస్థులతో కలిసి అందినకాడికి దండుకున్నారు. నిందితులపై సైబర్ క్రైమ్‌పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరిపై దేశవ్యాప్తంగా మొత్తం 12 కేసులు నమోదైనట్టు పోలీసులు గుర్తించారు. అందుకు సంబంధించి శనివారం సిసిఎస్ పోలీసులు వివరాలు వెల్లడించారు. నవీ ముంబయిలోని వాషి ప్రాంతానికి చెందిన రవి కుమార్‌లాల్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఎపికె ఫైల్ ద్వారా పూణేకు చెందిన విరాజ్ (ప్రస్తుతం పరారీలో ఉన్నాడు)తో కలిసి బ్యాంక్ ఆఫ్ బరోడా అకౌంట్‌ను ఆపరేట్ చేయడంలో సైబర్ నేరస్థులకు సహాయం చేశాడు. మరో నిందితుడు శివేంద్ర అశోక్‌సింగ్ 'మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్' (మోసాలకు ఉపయోగించే అకౌంట్లు) తెరిచి, వాటిని సైబర్ నేరస్తులకు సరఫరా చేశాడు. ఇద్దరు నిందితులు సైబర్ నేరస్థులతో చేతులు కలిసి నగరానికి చెందిన 53 ఏళ్ల వృద్ధుడిని టార్గెట్ చేశారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలని, వాట్సప్ ద్వారా పరిచయం చేసుకున్నారు. ఈ ఏడాది ఆగస్టు 13 నుంచి 28 వరకు ట్రేడింగ్ పేరుతో రూ.12,30,000 డిపాజిట్ చేయించుకున్నారు. వారిపై అనుమానం వచ్చిన వృద్ధుడు తాను పెట్టిన డబ్బులను తిరిగివ్వాలని డిమాండ్ చేయడంతో, మరికొంత డబ్బులు పెట్టుబడిగా పెడితే తిరిగి డబ్బులు ఇస్తామని, లేకపోతే పెట్టిన డబ్బులను కోల్పోతారని బెదిరించారు. మోసపోయినట్టు గుర్తించిన బాధితుడు సిసిఎస్‌లో ఫిర్యాదు చేశాడు. అన్ని కోణాల్లో విచారించిన ఇన్‌స్పెక్టర్ పి.ప్రమోద్ కుమార్ నేతృత్వంలోని బృందం, ఎస్ఐ షేక్ అజీజ్, ఇతర సిబ్బంది.. దర్యాప్తు ప్రారంభించారు. సైబర్ నేరస్థులకు సహకరిస్తున్న నిందితులను అరెస్టు చేశారు.

9న డ్రోన్‌షో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ తొమ్మిదిన జరగబోయే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ముగింపు సందర్భంగా గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పేలా డ్రోన్ షోను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఒకేసారి మూడు వేల డ్రోన్లతో ఆకాశంలో 'తెలంగాణ ఈస్ రైజింగ్, కమ్. జాయిన్ ద రైజ్' అనే అక్షరాల సమాహారం ఆవిష్కరించేలా డ్రోన్ షో నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు డ్రోన్లతో ఆకాశంలో అత్యంత పొడవైన వాక్యాన్ని ప్రదర్శించిన రికార్డు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అబుదాబీ పేరిట ఉంది. 2025 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా 2,131 డ్రోన్లతో 'హ్యాపీ న్యూ ఇయర్' అనే వాక్యాన్ని ప్రదర్శించి ఈ రికార్డును అందుకుంది. అంతకు మించిన సంఖ్యలో డ్రోన్లను ఉపయోగించి గ్లోబల్ సమ్మిట్ ముగింపు వేడుకల్లో అద్భుతమైన డ్రోన్ షో నిర్వహించనుంది. డ్రోన్‌షోతో తెలంగాణ రైజింగ్ నినాదాన్ని గగనతలంలో ప్రదర్శించి ప్రపంచ రికార్డు అధిగమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది.

బిసి స్టడీ సర్కిల్స్ ద్వారా ఐఇఎల్‌టిఎస్ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విదేశాల్లో ఉన్నత విద్యనుభ్యసించే వారికి అంతర్జాతీయ ఉపకార వేతనాలు పొందేలా స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇస్తున్నట్టు బిసి స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బిసిలు, ఇతర విద్యార్థులకు విదేశాల్లోని అత్యున్నత విశ్వ విద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఉన్నఅవకాశాలను, అభ్యసించేందుకు ఇస్తున్న అంతర్జాతీయ ఉపకారవేతనాలపై నిర్మాణాత్మక అవగాహన సెషన్లు, శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమాలు రాష్ట్రంలోని 12 బిసి స్టడీ సర్కిల్స్‌లో నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఆసక్తి వున్న గ్రాడ్యుయేషన్ (ప్రొఫెషనల్ మరియు నాన్ ప్రొఫెషనల్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ ఏడాది డిసెంబర్ 1 నుంచి 21వ తేదీ వరకు టి.జి.బి.సి.స్టడీ సర్కిల్ వెబ్ సైట్ www.tgbcstudycircle.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మరింత సమాచారం 040-24071178 నెంబర్‌లో సంప్రదించొచ్చు.

స్త్రీల పట్ల చులకన భావం తగదు

ఐద్వా చర్చాగోష్టిలో వక్తలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సాహిత్య రంగంలో మహిళలను కించ పరిచే పదాలు పెరుగుతున్నాయని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం 14వ జాతీయ మహాసభల సందర్భంగా 'మహిళలు నేటి సవాళ్లు' అనే అంశంపై చర్చాగోష్టిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి విజయలక్ష్మి మాట్లాడుతూ సాహితీ రంగంలో మూఢ విశ్వాసాలు పెరిగి పోతున్నాయని తెలిపారు. ఇది భావి తరాలకు మంచిది కాదని చెప్పారు. వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టేలా రచనలు ఉండాలన్నారు. సమాజంలో స్త్రీలు ఎన్నో రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారనీ, వాటిని పోరాటాల ద్వారానే పరిష్కరించుకోవాలని సూచించారు. ఐద్వా సీనియర్ నాయకురాలు టి జ్యోతి మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి 25 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో జరగనున్న ఐద్వా జాతీయ మహాసభల్లో దేశంలో రాష్ట్రంలో స్త్రీలపై హింస, వివక్ష, పని ప్రదేశాల్లో దాడులు తదితర అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు. పోరాడి సాధించుకున్న హక్కులకు భంగం కలిగే విధంగా కేంద్ర ప్రభుత్వం విధానాలను రూపొందిస్తున్నదనీ, వాటి ఫలితంగా మహిళలకు అందరి కంటే ఎక్కువ ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.మహిళలపై కొత్త రూపాల్లో దాడులు జరుగుతున్నాయని వాపోయారు. రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి మాట్లాడుతూ మహిళలు తమ ప్రతిభను చాటుకుంటూ ప్రతి అంశంలో ముందుండాలని చెప్పారు. 80ఏండ్ల స్వాతంత్రంలో స్త్రీలు నేటికి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని చెప్పారు. రచయితలు కమల, బండారు విజయ, కస్తూరి అలివేని, లలితాచండీ, ఉదయలక్ష్మి, సలీమ, పి. ఎన్ మూర్తి మాట్లాడుతూ. సమాజంలో ఆడపిల్ల పట్ల చులకన భావం ఉన్నదని చెప్పారు. అందుకే కడుపులో పెరిగే బిడ్డ అడపిల్ల అని తెలియగానే అబార్షన్లు చేయిస్తున్నారని తెలిపారు. సాంస్కృతిక కాలుష్యం వల్ల ఏడాది పిల్ల నుంచి 70 ఏండ్ల ముసలమ్మ వరకు సమాజంలో రక్షణ లేకుండా పోయిందని వివరించారు. చర్చా గోష్టిలో ఐద్వా రాష్ట్ర సహాయకార్యదర్శి కెఎన్. ఆశాలత, సీనియర్ జర్నలిస్టు రాజకుమారి, ఐద్వా నాయకులు ఎస్. విజయ, రత్న శ్రీ, గాయిత్రి, విజయలక్ష్మి, వి. కవిత పాల్గొన్నారు.

ఆనాడు పిసిసి చీఫ్ ఎక్కడున్నారు?

- మూడు తరాలను ముంచిన కాంగ్రెస్
- తెలంగాణను కాపాడేది గులాబీ జెండా, కెసిఆర్ గళమే
- దీక్షా దివస్‌లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ పార్టీ అధినేత కెసిఆర్ 2009లో చేసిన దీక్ష గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ఆనాడు ఆ ఉద్యమంలో ఎక్కడున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రశ్నించారు. మూడు తరాలను ముంచిన కాంగ్రెస్ పార్టీయే తెలంగాణకు శాశ్వత శత్రువు అని ఆయన విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం, ప్రొఫెసర్ జయశంకర్, అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షకు వ్యతిరేకంగా ఈ ప్రాంతాన్ని బలవంతంగా ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలి దశ తెలంగాణ ఉద్యమాన్ని అణచివేసి, ఉద్యమకారులను కాల్చి చంపిందని వాపోయారు. ఆ తర్వాత గెలిచిన తెలంగాణ ప్రజా సమితి 11 మంది ఎంపిలను కాంగ్రెస్‌లో కలుపుకుని తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను చంపేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. అనంతరం మలి దశ ఉద్యమంలోనూ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నీరుగార్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నించిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఎజెండాగా 2004లో బిఆర్ఎస్ (నాడు టిఆర్ఎస్) నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను ఫిరాయింపులకు ప్రోత్సహించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్, నగర ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను నిరాకరిస్తూ అసెంబ్లీలో తీర్మానించాలి

- మంత్రి వివేక్‌కు కేంద్ర కార్మిక సంఘాల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో అమలు చేయబోమంటూ శాసన సభలో తీర్మానం చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు శనివారం కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామికి హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశాయి. ఆ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా కార్మికవర్గం 2023 ఫిబ్రవరి 16న సెక్టోరల్ సమ్మె చేసిందని ఆయా సంఘాల నేతలు గుర్తు చేశారు. 2025 జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో 30 కోట్ల మందికి పైగా కార్మికులు పాల్గొని తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. పార్లమెంట్‌లో నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాహుల్ గాంధీ, వామపక్ష పార్టీల జాతీయ నాయకులు, బిజెపియేతర పార్టీల నాయకులు డిమాండ్ చేశారని గుర్తు చేశారు. అయినా కేంద్ర ప్రభుత్వం విదేశీ బహుళ జాతీ సంస్థల ప్రయోజనాలను కాపాడేందుకు అప్రజాస్వామికంగా లేబర్ కోడ్‌ల అమలుకు నవంబర్ 21న నోటిఫికేషన్లను జారీ చేసిందని తెలిపారు. ఆ కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఇప్పటికే పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలో తీర్మానాలు చేశాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో విదేశీ, స్వదేశీ బహుళ జాతి సంస్థలకు గరిష్ట లాభాలు కట్టబెట్టేందుకు లేబర్ కోడ్‌ల ద్వారా కార్మిక హక్కులను హరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక శాఖ అధికారాలను బలహీనం చేస్తున్నదనీ, ఇంతటి ప్రమాదకరమైన లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో అమలు చేయకుండా కార్మిక వర్గ హక్కులను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని సిఎం దృష్టికి తీసుకెళతానని మంత్రి కార్మిక సంఘాలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి జాతీయ ఉపాధ్యక్షులు నాగన్న గౌడ్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి యూసఫ్, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బ రామారాలు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, కార్యదర్శి జె వెంకటేశ్, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కె.సూర్యం, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.అనురాధ, బిఆర్‌టియు నాయకులు జి.రాంబాబు యాదవ్, ఎఐటియుసి రాష్ట్ర ఇన్‌చార్జి భరత్‌తో పాటు ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి నేతలు పాల్గొన్నారు.